సాక్షి ప్రకాశం

శుక్రవారం । 22 । ఆగస్టు । 2025



దివ్యాంగుల పెన్షన్ వెరి పికేశన్

కూటమి ప్రభుత్వం దివ్యాంగుల జీవితాలతో ఆటలాడుతోంది. రీ వెరిఫికేషన్ పేరుతో వికలాంగత్వం పర్సంటేజీ తగ్గించడంతో దివ్యాంగుల పింఛన్లు రద్దయ్యాయి. - 10లో..



విద్యార్థులు ప్రపంచాన్ని చదవాలి

విద్యార్థులు సరైన కోణంలో ప్రపంచాన్ని అర్థం చేసుకునేందుకు ప్రయత్నించాలని ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ సూచించారు. - 10లో..

గరిష్ఠం/కనిష్ఠం

36 /27

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పనులు వేగవంతం చేయండి



మాట్లాడుతున్న ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి

ఒంగోలు సబర్బన్: ఆర్‌డీఎస్ఎస్ పనులు వేగవంతం చేయాలని, అందుకు సంబంధించిన కార్యాచరణ రూపొందించుకొని ముందుకు పోవాలని ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి విద్యుత్ అధికారులను ఆదేశించారు. స్థానిక రామ్‌నగర్‌లోని విద్యుత్ భవన్‌లోని కాన్ఫరెన్స్‌లో గురువారం ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన విద్యుత్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో కేంద్ర, రాష్ట్రాల ముఖ్య పథకాలైన ఆర్డీఎస్ఎస్, పీఎం సూర్య ఘర్ పురోగతి మీద ప్రత్యేకంగా సమీక్షించారు. రైతులకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు అందించటంలో నిర్లక్ష్యం విడనాడాలన్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల విషయంలో ఎలాంటి ఆరోపణలు వచ్చినా సహించేది లేదన్నారు. పరివర్తకాల పనితీరు విషయంలో కూడా సిబ్బంది, అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యుత్ శాఖపై ప్రజల అభిప్రాయం, విద్యుత్ కలెక్షన్లు, బకాయిలపై సమీక్షించారు. ప్రజలకు స్మార్ట్ మీటర్లు పట్ల ఉన్న అపోహలను తొలగించాలని, వాటి ఆవశ్యకతను తెలియజేయాలని సూచించారు. ఏపీ సీపీడీసీఎల్ డైరెక్టర్లు మురళీకృష్ణ యాదవ్, జిల్లా ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు, ఈఈలు, డీఈఈ లు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్టు

- 26 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసిన తిరుపతి టాస్క్‌ఫోర్స్ బృందం

కొమరోలు : తిరుపతి టాస్క్‌ఫోర్స్ బృందం ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసి 26 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లుగా కడప సబ్ కంట్రోల్ ఆర్ఎస్ఐ నరేష్ తెలిపారు. మండలంలోని గుంతపల్లె బీట్ పరిధిలో టాస్క్‌ఫోర్స్ బృందం కూంబింగ్ చేపట్టింది. ఈ క్రమంలో ముగ్గురు అనుమానాస్పదంగా సంచరిస్తూ టాస్క్‌ఫోర్సు బృందాన్ని చూసి పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారు. విచారణలో గుంతపల్లె అటవీ ప్రాంతంలోని కల్వర్టు కింద 26 ఎర్రచందనం దుంగలను ఉంచినట్లుగా తెలిపారు. టాస్క్‌ఫోర్స్ బృందం 26 ఎర్రచందనం దుంగలను, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకొని తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసుస్టేషన్‌కు తరలించినట్లుగా తెలిపారు. ఎర్రచందనం దుంగల విలువ రూ.25 లక్షలు ఉంటుందని అధికారులు వెల్లడించారు.

'న్యాయం చేస్తామని చెప్పారు'

- ఫారెస్టు ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు




అటవీశాఖ డీడీకి వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాసరావు

మార్కాపురం: శ్రీశైల శిఖరం వద్ద అటవీ శాఖ ఉద్యోగులపై దాడి చేసిన సంఘటనలో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు అధికారులు చెప్పారని, న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని ఏపీ జూనియర్ ఫారెస్టు ఆఫీసర్స్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు తెలిపారు. అసోషియేషన్ నాయకులతో కలిసి గురువారం అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ సందీప్ కృపాకర్‌కు వినతి పత్రం అందించి తమ సమస్యలు విన్నవించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్యే దాడి సంఘటనపై ముఖ్యమంత్రికి, ఉప ముఖ్యమంత్రికి వివరించామని, వారు స్పందించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. అడవుల్లో క్రూరమృగాలు, విషసర్పాల మధ్య తాము విధులు నిర్వర్తిస్తున్నామని, ఇలాంటి పరిస్థితుల్లో తమపై దాడి చేయడం బాధగా ఉందన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు, నాగార్జునసాగర్ ప్రాజెక్టు మధ్య నల్లమల అటవీ ప్రాంతం ఉందని, దేశంలోనే పెద్ద టైగర్ రిజర్వు ప్రాజెక్టు అని పులులను కాపాడేందుకు తాము కష్టపడుతున్నామన్నారు. అడవులో అభివృద్ధి పనులు చేయాలంటే నిబంధనల ప్రకారం చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు శశిభూషణ యాదవ్, మార్కాపురం యూనిట్ కార్యదర్శి ఎం వెంకటేశ్వర్లు, సుధాకర్, బాలాకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఏడాది గడుస్తూ! పరీక్షిస్తూ..

- మెరిట్ జాబితా కోసం ఎదురుచూపులు
- కూటమి ప్రభుత్వ తీరుతో గందరగోళంలో అభ్యర్థులు
- మెసేజ్ వస్తేనే వెరిఫికేషన్‌కు రావాలంటూ ప్రచారం
- జిల్లా వ్యాప్తంగా 623 పోస్టులు భర్తీ
- 21,559 మంది పరీక్షకు హాజరు
- ఎంపిక ప్రక్రియపై రోజుకో రకంగా ప్రచారం
- ఆందోళనలో అభ్యర్థులు



మెగా డీఎస్సీ అంతా గందరగోళంగా తయారైంది. ఏడాది కాలంగా ఉపాధ్యాయ కొలువుల భర్తీపై ప్రభుత్వం నిరుద్యోగులను ఊరిస్తూ వస్తోంది. అర్హత పరీక్ష నిర్వహించిన తర్వాత కూడా ఫలితాలు వెల్లడి దగ్గర నుంచి నియామక ప్రక్రియ చేపట్టే వరకూ అంతా అస్తవ్యస్తంగా తయారైంది. మెరిట్ లిస్ట్ ఎప్పుడు వస్తుంది..భర్తీ ఎప్పుడు జరుగుతుందన్న విషయంపై జిల్లా విద్యాశాఖ అధికారులు సైతం సరైన సమాధానం ఇవ్వడం లేదు. దీనిపై అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియ నిబంధనలకు విరుద్ధంగా జరుగుతోందంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఒంగోలు సిటీ: జిల్లాలో వివిధ కేటగిరీల కింద 623 ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం ఏప్రిల్ 14వ తేదీన డీఎస్సీ 2025 నోటిఫికేషన్ విడుదల జేసింది. మే 15వ తేదీ వరకూ దరఖాస్తులు స్వీకరించింది. జూన్ 6వ తేదీ నుంచి జూలై 4 వరకు పరీక్షలు జరిగాయి. 21,559 మంది అభ్యర్థులు కంప్యూటర్ ఆధారిత పరీక్షలు రాశారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిలో 2152 మంది గైర్హాజరయ్యారు. తుది కీని ఆగస్టు 1 తేదీన విద్యాశాఖ విడుదల చేసింది. ఆగస్టు 14న అభ్యర్థుల వ్యక్తిగత లాగిన్‌లో నార్మలైజేషన్ మార్కులతో కలిపి స్కోర్ ఇచ్చింది. అయితే టెట్ వివరాలు విద్యాశాఖ దగ్గర లేకపోవడంతో మెరిట్ జాబితా విడుదలలో జాప్యం జరుగుతోంది. శుక్రవారం టెట్ మార్కులు అప్‌లోడ్ చేసేందుకు చివరి అవకాశంగా విద్యాశాఖ ప్రకటించింది.

భర్తీపై రోజుకో కథనం

మెగా డీఎస్సీ ద్వారా పెద్ద ఎత్తున ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామంటూ నిరుద్యోగులను ఊరిస్తూ వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాది దాటిన తర్వాత డీఎస్సీ ప్రకటన చేసింది. పోస్టుల ప్రకటన, పరీక్షల నిర్వహణ, ఫలితాలు వెల్లడి వరకూ అంతా అస్తవ్యస్తంగా తయారైంది. ఇదిలా ఉండగా ఉపాధ్యాయుల కొలువుల భర్తీకి సంబంధించి అధికార పార్టీ అనుకూల మీడియాతో పాటు, రకరకాల సోషల్ మీడియాల్లో రోజుకో కథనం పుట్టుకొస్తుండడంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. మెరిట్ జాబితాతో సంబంధం లేకుండా అర్హులకు ఫోన్ల ద్వారా మెజేస్‌లు పంపుతామని, వారు సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు రావాలన్న ప్రచారం జరుగుతూ వస్తోంది. వచ్చే నెల 5వ తేదీ నాటికి కొత్త ఉపాధ్యాయులు విధుల్లోకి చేరిపోతారంటూ ప్రకటనలు వెలువడుతున్నాయి. దీనిపై జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అభ్యర్థులకు క్లారిటీ ఇచ్చే వారు కరువయ్యారు. ఇంత గందరగోళం మధ్య ఏం జరుగుతుందో అనే భయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

గతంలో ఇలా..

డీఎస్సీ అభ్యర్థులకు పరీక్షలు నిర్వహించిన తరువాత ఎవరికి ఎన్ని మార్కులు వచ్చాయో తెలియజేసిన తరువాత మెరిట్ లిస్టు ప్రకటిస్తారు. మెరిట్ లిస్టు ప్రకటించిన తరువాత రోస్టర్ విధానంలో ఎంపిక చేసిన జాబితాను 1:2 నిష్పత్తిలో ప్రకటించి అభ్యర్థుల సర్టిఫికెట్లు వెరిఫై చేస్తారు. ఇలా ఎంపిక పారదర్శకంగా జరిగేది. ప్రస్తుతం అందుకు భిన్నంగా జరుగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జూన్‌లో నిర్వహించిన డీఎస్సీ 2025 పరీక్ష ఫలితాలను విద్యాశాఖ ప్రకటించింది. వాటిని అభ్యర్థుల ఫోన్లకు నేరుగా వివరాలను పంపింది. తాజాగా మెరిట్ జాబితాను ప్రకటించకుండా 1:5 నిష్పత్తిలో అభ్యర్థులకు మెసేజ్‌లు వస్తాయని వారు జిల్లాలో ఎంపిక చేసిన కేంద్రానికి వెళ్లి సరిఫికెట్లు పరిశీలన చేసుకోవాల్సి ఉంటుందని ప్రచారం జరిగింది. దీంతో ఎవరికి ఎన్ని మార్కులు వచ్చాయో తెలిసే అవకాశం లేదు. ఈసారి మెరిట్ లిస్టును సర్టిఫికెట్లు వెరిఫై రోజు ప్రకటిస్తారని విద్యాశాఖ వర్గాలు చెబుతుండడం గమనార్హం. ప్రస్తుతం జరుగుతున్న విధానాన్ని పరిశీలిస్తే పారదర్శకతకు అవకాశం లేదని అవినీతికి, పలుకుబడికి అవకాశం ఉందని, అర్హులకు ఉద్యోగాలు వచ్చే అవకాశం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇది ఇలా ఉంటే ఎంపికైన వారికి ఎక్కడ పోస్టింగ్ ఇవ్వాలని నిర్ణయించేందుకు ఖాళీల వివరాలను విద్యాశాఖ సేకరించినట్లు తెలుస్తోంది.

కేటగిరి	పోస్టులు
లాంగ్వేజ్ 1	39
ఇంగ్లీష్	95
హిందీ	23
గణితం	94
భౌతిక శాస్త్రం	24
జీవశాస్త్రం	70
సాంఘికశాస్త్రం	106
పీఈటీ	72
ఎస్‌జీటీ	106

14 బృందాల ఏర్పాటు..

మెరిట్ జాబితా ప్రకటించకుండా సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేస్తామని జిల్లా విద్యాశాఖ అధికారులు ఒక ప్రకటన విడుదల చేశారు. మెసేజ్ వచ్చిన అభ్యర్థులు నగర శివారు చెరువుకొమ్ముపాలెంలోని సరస్వతి జూనియర్ కళాశాలలో ధ్రువపత్రాల వెరిఫికేషన్‌కు రావాలంటున్నారు. ఇందుకు సంబంధించి జిల్లా విద్యాశాఖ అధికారులు 14 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీల్లో మండల విద్యాశాఖాధికారులు, ఐటీ సిబ్బంది కూడా ఉంటారు. సర్టిఫికెట్ల పరిశీలన చేసే విధానంపై బృందాలకు బుధవారం, గురువారం విజయవాడ విద్యాశాఖలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సమాచారం.

విద్యాశాఖ తీరు అధ్వానం



విద్యాశాఖ అధికారుల తీరు అధ్వానంగా ఉంది. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు డీఎస్సీ అభ్యర్థులను గందరగోళం చేసే విధంగా ఉన్నాయి. అభ్యర్థు మెరిట్ లిస్ట్ , వారి ర్యాంక్స్ విడుదల చేసిన తర్వాతే సెలక్ట్ లిస్ట్ విడుదల చేయాలి. గతంలో ఏ డీఎస్సీ కి లేని విధంగా కొత్త నిబంధనలు విధించడం సరికాదు. ఈ విధానంతో అక్రమాలు జరిగే అవకాశం ఉంది.

– సీహెచ్ వినోద్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు

ఫలితాల వెల్లడిలో సర్కార్ దగా



డీఎస్సీ ఫలితాల వెల్లడిలో కూటమి సర్కార్ నిరుద్యోగులను మోసం చేస్తోంది. ప్రభుత్వం మెరిట్ లిస్టును వెల్లడించకూడదనే నిర్ణయం వెనుక భారీ కుట్ర దాగి ఉంది. పారదర్శకతకు పాతర వేస్తూ, మెరిట్ అభ్యర్థుల నోట్లో మట్టి కొట్టేందుకు మంత్రి నారా లోకేష్ ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. పోస్టులకు అమ్ముకునేందుకు ఇలా చేస్తున్నారు. మెరిట్ లిస్ట్‌లను ప్రకటించకుండా, తమకు కావాల్సిన వారికే మెసేజ్‌లు పంపి పోస్టులను అమ్ముకునే కుట్ర సాగుతోంది. ఇప్పటికే టెట్‌కు సంబంధించి మార్కుల సవరణ విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. టెట్‌లో వచ్చిన మార్కులతో డీఎస్సీలో 20 మార్కులకు వెయిటేజీ ఉంది. డీఎస్సీ ఫలితాలు వెలువడే ముందు దాదాపు 60 వేల మందికి టెట్ మార్కుల సవరణకు అవకాశం ఇవ్వడం కూడా అభ్యర్థుల్లో అనుమానాలు కలిగిస్తోంది.

– పల్నాటి రవీంద్రారెడ్డి, వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు



డీఎస్సీ పరీక్షకు హాజరవుతున్న అభ్యర్థులు (ఫైల్)

బాబు పాలనలో రాష్ట్రం నిలువు దోపిడీ

- చంద్రబాబు మోసాలు ప్రతి ఒక్కరికీ తెలియజేయాలి
- మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున



బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ క్యూ ఆర్ కోడ్ చూపుతున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున, నేతలు

మద్దిపాడు: రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబు నిలువు దోపిడీ చేస్తూ కార్పొరేట్లకు భూములు అమ్మేస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు ఇన్‌చార్జి మేరుగు నాగార్జున ధ్వజమెత్తారు. మండలంలోని ఇనమనమెళ్లూరు గ్రామంలో గురువారం బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అబద్ధాలతో గద్దెనెక్కిన చంద్రబాబు ఏడాదిలో చేసిన మోసాలను ప్రతి ఒక్కరికీ తెలియజేయాలని పిలుపునిచ్చారు. బినామీ కంపెనీలతో భూములు మొత్తం కొనుగోలు చేయిస్తున్నాడని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా మద్యం దుకాణాలతో పాటు సిట్టింగ్‌కు అనుమతులు ఇచ్చి 14 గంటల పాటు మద్యం విక్రయించేలా అనుమతులు ఇవ్వడం దారుణమన్నారు. గ్రామాల్లో 24 గంటలూ బెల్టుషాపుల్లో మద్యం విక్రయిస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో గ్రామ గ్రామాన మద్యం ఏరులై పారుతోందని ఆరోపించారు. డీఎస్సీలో మెరిట్ లిస్టు ప్రకటించకుండానే ఎంపిక చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీని వెనుక లోకేష్ హస్తం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం సర్కారు ఉద్యోగార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందన్నారు. పింఛన్ రూ.4 వేలకు పెంచి వేల సంఖ్యలో దివ్యాంగుల పింఛన్లు రద్దు చేసి దివ్యాంగుల పట్ల దుర్మార్గంగా వ్యవహరించారని మండిపడ్డారు. ఒకటి రెండు హామీలను అరకొరగా అమలు చేసి అన్నీ చేశామని గొప్పలు చెప్పుకోవడం చంద్రబాబుకే చెల్లిందన్నారు. నమ్మి ఓట్లేసిన ప్రజలను మోసం చేయడం చంద్రబాబు నైజమన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి, ప్రస్తుత కూటమి పాలనకు ప్రజలు తేడా గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో తగిన బుద్ధి చెబుతారని చెప్పారు. వైఎస్సార్ సీపీ హయాంలో మూడేళ్ల కాలంలో పాఠశాలలు, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు ఇలా ఎన్నో నిర్మాణాలు చేస్తే చంద్రబాబు ఏడాదిలో చేసింది శూన్యమన్నారు. నిన్న మొన్నటి వరకు విజన్ 2020 అని, ఇప్పుడు విజన్ 2047 అంటున్నారని, అవేమీ ఎవరికీ అర్థం కావన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో ఎంతో మంది అర్హులకు అన్యాయం జరిగిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల సంక్షేమం కోసం సంక్షేమ పథకాలు అమలు చేస్తే కూటమి ప్రభుత్వంలో ఒక్క పథకాన్ని అమలు చేయకుండా అన్ని వర్గాలను మోసం చేస్తున్నారన్నారు. చంద్రబాబు మోసాలను తెలుసుకోవడానికి క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఆయన మోసాలు అన్ని తెలుస్తాయన్నారు. ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, సంతనూతపాడు అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి, పైడిపాటి వెంకట్రావు, యల్లమందారెడ్డి, కందుల డానియేల్, కిష్టిపాటి శేఖరరెడ్డి, బొమ్మల రామాంజనేయులు, సన్నపురెడ్డి రమణమ్మ, బెజవాడ రాము, పల్లపాటి అన్వేష్, నాదెండ్ల మహేష్, తేళ్ల పుల్లారావు, మద్దా లక్ష్మీనారాయణ, విల్సన్, పూనాటి అప్పయ్య, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సభ్యసమాజం తలదించుకునేలా ఎమ్మెల్యే 'బుడ్డా' తీరు

- అధికారులపై అధికార గర్వాన్ని ప్రదర్శించాడు
- పుణ్యక్షేత్రంలో మద్యం తాగి వీరంగం సృష్టించడం హేయమైన చర్య
- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్



యర్రగొండపాలెం: శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అటవీ శాఖ అధికారులపై వ్యవహరించిన తీరు సభ్య సమాజం తలదించుకునేలా ఉందని యర్రగొండపాలెం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం రాత్రి శ్రీశైలంలో అటవీ శాఖాధికారులపై ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, తన అనుచరులు దాడి చేసిన సంఘటనపై ఆయన స్పందించారు. ఈ మేరకు గురువారం పార్టీ కార్యాలయంలో ఆయన సాక్షితో మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి నేతలకు అధికార మదం తలకెక్కి మనుషులమేనన్న విచక్షణ కోల్పోయి ఏకంగా అధికారులపై జులుం ప్రదర్శిస్తున్న తీరు అందరూ గమనిస్తున్నారన్నారు. పవిత్ర పుణ్యక్షేత్రానికి అతిసమీపంలో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా అర్ధరాత్రి సృష్టించిన వీరంగం రాష్ట్రంలో అధికారులపై ప్రభుత్వానికి ఉన్న చిన్న చూపు, లెక్కలేనితనాన్ని సూచిస్తుందన్నారు. ఆ ఎమ్మెల్యే రాష్ట్రంలో సీబీఎస్ అమ్ముతున్న కల్తీ మద్యం సేవించినట్లుందని, తాను ఒక ఎమ్మెల్యే అని మరచి తనకున్న అధికార గర్వాన్ని ప్రదర్శించాడని మండిపడ్డారు. దళితుడైన ఎఫ్‌బీవో టీకే గురవయ్యను వాహనంలో ఎక్కించుకొని ఆయన ఛాతిపై తన అనుచరులతో దాడి చేయిస్తూ రాత్రంతా రోడ్లపై తిప్పాడని, ఈ సంఘటన సభ్య సమాజం ఛీత్కరించుకునేలా ఉందన్నారు. ఇంత జరిగినా ఆ శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు చీమకుట్టినట్లు లేక పోవడం శోచనీయమని, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

గుండ్లకమ్మ పరవళ్లు



చోళ్లవీడు బ్రిడ్జి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గుండ్లకమ్మ

రాచర్ల: మండలంలో నల్లమల అటవీ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు గుండ్లకమ్మవాగు పరవళ్లు తొక్కుతూ ఉధృతంగా ప్రవహిస్తోంది. చోళ్లవీడు గ్రామ సమీపంలోని బ్రిడ్జి వద్ద గుండ్లకమ్మ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. అకవీడు, చోళ్లవీడు, చినగానిపల్లె పంచాయతీల్లోని తురకవాని చెరువు, దొడ్డేనిచెరువు, ఉప్పలేటిచెరువు, ఎర్రగుడిదిన్నె చెరువు, రంగయ్యనాయుడు చెరువులకు గుండ్లకమ్మ వరద నీటితో కళకళలాడుతున్నాయి. దీంతో ఆయా గ్రామాల్లో భూగర్భజలాలు పెరిగి వ్యవసాయ బోరుబావులకు నీరు వస్తున్నాయని ఆయా గ్రామాల రైతులు వివరించారు. ఆకవీడులోని తురకవాని చెరువు అలుగు పారుతుండటంతో పంటకాలువలు మరమ్మతులకు గురై గ్రామం నుంచి మోకాలి లోతులో నీరు ప్రవహిస్తున్నాయి. రోడ్డుపై నీరు ప్రవహిస్తుండటంతో వచ్చేపోయే వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుండ్లకమ్మ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వాగులో ముమ్మరంగా చేపల వేట కొనసాగిస్తున్నారు.

అటవీ శాఖ సిబ్బందిపై దాడి హేయమైన చర్య

- ఎమ్మెల్యేపై ఎస్సీ ఎస్టీ, హత్యాయత్నం కేసులు నమోదు చేయాలి
- అటవీశాఖ సిబ్బందికి అండగా గిరిజన ప్రజాసమాఖ్య
- ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్



అటవీశాఖ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న శంకర్‌నాయక్, తదితరులు

మార్కాపురం:

అటవీశాఖ సిబ్బందిపై దాడిచేసి భయభ్రాంతులకు గురిచేసిన శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డిపై ఎస్సీ, ఎస్టీ, హత్యాయత్నం చట్టాల కింద కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు, గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ అధ్యక్షుడు వడిత్య శంకర్‌నాయక్ డిమాండ్ చేశారు. శ్రీశైల శిఖరం వద్ద విధి నిర్వహణలో ఉన్న ఫారెస్టు అధికారులపై బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి మద్యం సేవించి సిబ్బందిపై దాడి చేసినందుకు నిరసనగా సభ్యులతో కలిసి మార్కాపురంలోని అటవీ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయం వద్ద నిరసనకు దిగారు. అనంతరం డిప్యూటీ డైరెక్టర్ సందీప్ కృపాకర్‌కు వినతిపత్రం అందచేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్యే అటవీశాఖ సిబ్బందిపై దాడి చేయడంతో పాటు ఫారెస్టు అధికారిక వాహనాన్ని తానే నడుపుతూ సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేశారన్నారు. శ్రీశైలం ఘాట్‌లో రాత్రిపూట వాహనాన్ని తిప్పి అక్కడి నుంచి అతిథి గృహానికి తీసుకెళ్లి తన అనుచరులతో దాడి చేయించడం దుర్మార్గమైన చర్య అన్నారు. విధి నిర్వహణలో యూనిఫాంలో ఉన్న అటవీ అధికారులపై దాడి చేయడంతో పాటు మానసిక క్షోభకు గురైన అధికారులకు తక్షణమే అన్నీ విధాలుగా అండగా ఉండాలన్నారు. దాడికి పాల్పడిన ఎమ్మెల్యే, ఆయన అనుచరులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, హత్యాయత్నం, విధి నిర్వహణకు ఆటంకం పరిచిన అంశాలపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే అధికారులకు అండగా తాము రాష్ట్ర వ్యాప్తంగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. భవిష్యత్‌లో ఇటువంటి సంఘటనలు జరగకుండా, అటవీ శాఖ అధికారులకు రక్షణ కల్పిస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని శంకర్ నాయక్ డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు రామూనాయక్, ధర్మా నాయక్, మనోజ్ నాయక్, వీరాంజనేయులు నాయక్, హనుమంత్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, కోటి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ

ఒంగోలు వన్‌టౌన్: జిల్లాలోని షెడ్యూల్డ్ కులాల అభ్యర్థులకు హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంస్థ కార్యనిర్వాహక సంచాలకుడు అర్జున్ నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు వయసు 20 ఏళ్లు ఉండాలని, కనీసం ఏడాది కాలపరిమితి పూర్తయిన లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్సు అభ్యర్థులు కలిగి ఉండాలన్నారు. ఈ నెల 27 లోగా దరఖాస్తులను ప్రగతిభవన్‌లో అందజేయాలని కోరారు.

పోలీస్ శాఖలో భారీగా బదిలీలు

ఒంగోలు టౌన్: జిల్లాలో పోలీస్ శాఖలో భారీగా బదిలీలు చేస్తూ ఎస్పీ ఏఆర్ దామోదర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం 231 మందిని బదిలీ చేశారు. గత నవంబర్‌లో 39 మందిని అటాచ్ చేశారు. వారిలో 13 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 26 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు. వీరితో పాటుగా రిక్వెస్టు చేసుకున్న మరికొందరిని కూడా బదిలీ చేశారు. వీరంతా 5 ఏళ్లు పూర్తి చేసుకున్న వారే కావడం గమనార్హం. జిల్లా వ్యాప్తంగా బదిలీ అయిన వారిలో 59 మంది ఏఎస్సైలు, 71 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 101 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు.

క్లుప్తంగా

గణేష్ మండపాల అనుమతికి సింగిల్ విండో విధానం

● ఎస్పీ ఏఆర్ దామోదర్



ఎస్పీ ఏఆర్ దామోదర్ (ఫైల్)

ఒంగోలు టౌన్: ప్రభుత్వ నిబంధనలకు లోబడి వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించుకోవాలని, గణేష్ విగ్రహాల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ స్పష్టం చేశారు. వినాయక మండపాల అనుమతులకు పోలీసు శాఖ ప్రత్యేకంగా సింగిల్ విండో విధానాన్ని తీసుకొచ్చిందని, గణేష్‌ఉత్సవ డాట్ నెట్ అనే వెబ్‌సైట్‌లో కమిటీ సభ్యుల వివరాలు, మండపం ఏర్పాటు చేసే స్థలం, పోలీసు స్టేషన్ పరిధి, విగ్రహం ఎత్తు, మండపం ఎత్తు, విగ్రహ ప్రతిష్ట జరిపే రోజు, నిమజ్జనం ఎక్కడ చేస్తారు, ఏ వాహనంలో నిమజ్జనానికి తరలిస్తారు తదితర వివరాలు తెలియజేస్తూ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని వివరించారు. పోలీసు అనుమతి పొందడానికి ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు మేరకు ఎస్‌హెచ్‌ఓ తనిఖీ చేసి, క్యూఆర్ కోడ్ కలిగిన నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ జారీ చేస్తారని తెలిపారు. వినాయక విగ్రహాల వద్ద భద్రతాపరమైన జాగ్రతలు తీసుకోవాలని సూచించారు.

బైకుల దొంగ అరెస్టు

● నిందితుడి నుంచి 2 బైకులు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సుబ్బారావు, పక్కన ఎస్సైలు

మార్కాపురం: చెడు వ్యసనాలకు లోనై బైకులు చోరీ చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రెండు బైకులు స్వాధీనం చేసుకున్నట్లు మార్కాపురం సీఐ పి.సుబ్బారావు తెలిపారు. గురువారం సాయంత్రం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నిందితుడి వివరాలు వెల్లడించారు. పట్టణంలోని ఎస్‌వీకేపీ కళాశాల ఎదురు నారాయణం శ్రీనివాసులు అనే వ్యక్తికి చెందిన టూవీలర్ చోరీ కాగా ఈనెల 19వ తేదీన టౌన్ ఎస్సై సైదుబాబు కేసు నమోదు చేశారు. వన్‌టౌన్ ఎస్సై సైదుబాబు, టూటౌన్ ఎస్సై రాజమోహన్‌రావుతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి విచారణ చేపట్టారు. గురువారం పట్టణంలోని సహారా పెట్రోల్ బంకు వద్ద అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు. నిందితుడిని పెద్దదోర్నాల మండలం వైచెర్లోపల్లి గ్రామానికి చెందిన సంద్ర అజయ్‌గా పోలీసులు గుర్తించారు. మార్కాపురం పట్టణంతోపాటు దోర్నాలలో కూడా బైక్ చోరీ చేసినట్లు నిందితుడు ఒప్పుకొన్నాడు. నిందితుడి నుంచి రూ.1.75 లక్షల విలువైన 2 బైకులు స్వాధీనం చేసుకున్నామని, కోర్టులో హాజరుపరచనున్నట్లు సీఐ చెప్పారు.

హాస్టళ్లలో విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా



సంక్షేమ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. గురువారం వివిధ సంక్షేమ శాఖల ఉన్నతాధికారులతో తన క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. హాస్టళ్లలో విద్యార్థినీ, విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలంటే భోజనం, వసతి తోపాటు పరిసరాలు బాగుండాలన్నారు. రెసిడెన్షియల్ విద్యాలయాల్లో పిల్లల ఆరోగ్యంపై కూడా శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. విద్యాలయాలతోపాటు హాస్టళ్లలో పనిచేస్తున్న సిబ్బంది వివరాలు-ఖాళీలు, మౌలిక సదుపాయాలు, సొంత-అద్దె భవనాలు, ఉన్నతాధికారులు తనిఖీ చేస్తున్న తీరు, విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న విధానం, ఆహార నాణ్యత, మెనూ అమలు -సమస్యలపై కలెక్టర్ చర్చించారు. ఉన్నతాధికారులు హాస్టళ్లను తనిఖీ చేసిన వివరాలు ప్రతి వారం తనకు నివేదించాలని ఆదేశించారు. ఆయా హాస్టళ్లను నియోజకవర్గాల స్పెషల్ ఆఫీసర్లకు ట్యాగ్ చేసి ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని చెప్పారు. ఆరోగ్య సమస్యలను విద్యార్థులు ప్రస్తావించినప్పుడు తేలికగా తీసుకోవద్దని, వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరిగితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. పదో తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ గైడ్లు త్వరగా వచ్చేలా చూస్తానని, గణితం, సైన్స్ బోధించేందుకు ట్యూటర్లను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, బీసీ సంక్షేమ అధికారి నిర్మల జ్యోతి, గిరిజన సంక్షేమ అధికారి వరలక్ష్మి, దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు సువార్త, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయ అధికారి జయ, కేజీబీవీ జీసీడీఓ హేమలత, ఆయా శాఖల నియోజకవర్గ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నా కడుపు కొట్టారు..

నా కళ్లు పనిచేయవు. 2011లో సదరం సర్టిఫికెట్‌లో 77 శాతం వికలాంగత్వం ఉన్నట్లు సర్టిఫికెట్ ఇచ్చారు. అప్పటి నుంచి పెన్షన్ తీసుకుంటున్నాం. ఇటీవల రీ వెరిఫికేషన్‌లో వైద్యులు 46 శాతం వికలాంగత్వం ఉన్నట్లు ఇచ్చారు. నేను కాలికి బూటు వేసుకుంటే గానీ పైకి లెగవలేను. బూటు కొనుక్కోవాలంటే రూ.78 వేలు ఖర్చవుతుంది. వీటిని కేంద్రంగా ఉచితంగా ఇస్తుంది. 46 శాతం పర్సంటేజీ ఇవ్వడం వల్ల ప్రభుత్వ పథకాలు వర్తించవు. నా పింఛన్ తొలగించి నా కడుపు కొట్టారు.



-కొచ్చెర్ల లక్ష్మి, దివ్యాంగురాలు, ఊళ్లపాలెం

రెండు కాళ్లూ పనిచేయవు

నా రెండు కాళ్లు పనిచేయవు. పక్షవాతం కూడా వచ్చింది. ఒకరి సాయం లేకుండా ఎక్కడికి వెళ్లలేను. వికలాంగత్వం తక్కువగా ఉందని నా పింఛన్ తొలగించామని చెప్పారు. ఇప్పుడు ఏం చేయాలో అర్థం కావడం లేదు. మళ్లీ అప్పీల్ చేసుకోమంటున్నారు. కొండపి ఆస్పత్రికి ఆటోలో వెళ్లాలంటే రూ.2 వేలు ఖర్చవుతుంది. ఆటోలో కొండపి వెళుతుంటే సగం దూరం వెళ్లాక సచివాలయ సిబ్బంది ఫోన్ చేసి డాక్టర్ లేరని చెప్పారు. ఇప్పుడు ఏం చేయాలో అర్థం కావడం లేదు.



- కుంచాల సుజాత, డ్రైవర్‌పేట రెండో లైను, సింగరాయకొండ

పింఛనే జీవనాధారం



నేను ఏ పనిచేయలేను. కాళ్లు, వంకరపోయాయి. నడవలేని పరిస్థితి. కర్ర సాయంతోనే నడవాలి. పింఛనే జీవనాధారం. ఇప్పుడు నా పింఛన్ అన్యాయంగా తొలగించారు. ఇక ఏం చేయాలో అర్థం కావడం లేదు. మాలాంటోళ్ల జీవితాలతో చెలగాటమాడటం ఎంత వరకు సమంజసం

- బత్తుల ఆదెయ్య, హనుమంతునిపాడు

దివ్యాంగుల పెన్షన్ వెరి'పీకేశన్'..!



సింగరాయకొండ మండల పరిషత్ కార్యాలయం వద్ద అప్పీల్‌కు వచ్చిన దివ్యాంగులు

దివ్యాంగుల జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోంది. కనీసం నడవడానికి వీల్లేని వారి పింఛన్లను సైతం రీ వెరిఫికేషన్ పేరుతో తొలగించింది. ఫలితంగా ఒక్క సింగరాయకొండ మండలంలోనే 108 మంది దివ్యాంగుల పింఛన్లను రద్దు చేశారు. రీ వెరిఫికేషన్‌లో వైద్యులు ఇష్టారీతిన పర్సంటేజీలు ఇవ్వడంతో పదేళ్లుగా పింఛన్లు తీసుకుంటున్న దివ్యాంగులను కూడా అనర్హులుగా తేల్చి పింఛన్లు రద్దు చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పింఛను తొలగించి నోటికాడ ముద్ద లాగేసిన సర్కారు

సదరం వెరిఫికేషన్‌లో ఇష్టారీతిగా పర్సెంటేజీ ఇచ్చిన వైద్యులు

- ఒక్కో మండలానికి 100కు పైగా రద్దు
- కదల్లేని వారి పింఛన్లు కూడా తొలగించడంపై సర్వత్రా విమర్శలు
- పింఛన్ల అప్పీల్‌కు మండల కార్యాయాలకు దివ్యాంగులు

సింగరాయకొండ/హనుమంతునిపాడు/ ముండ్లమూరు:

అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఒక్క కొత్త పింఛన్ మంజూరు చేయని కూటమి ప్రభుత్వం ఉన్న పింఛన్లను మాత్రం ఇష్టం వచ్చినట్లు తొలగిస్తోంది. ముఖ్యంగా నడవడానికి వీల్లేకుండా, కాళ్లు, చేతులు వంకరపోయి ఏ పనిచేసుకోలేని వారి పింఛన్లను సైతం రీ వెరిఫికేన్ పేరుతో నిర్దాక్షిణ్యంగా తొలగించారు. దీంతో దివ్యాంగులు గగ్గోలు పెడుతున్నారు. వైద్యులు ఇష్టం వచ్చినట్లు పరీక్షించి మా కొడుపులు కొట్టారని మండిపడుతున్నారు. దివ్యాంగుల పట్ల ఇంత దుర్మార్గంగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వంపై దివ్యాంగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సింగరాయకొండలో 108 పింఛన్లు తొలగించాపు

సింగరాయకొండ మండలంలో 908 మంది దివ్యాంగ పింఛన్‌దారులు, 54 మంది ఆరోగ్య పింఛన్‌దారులు ఉన్నారు. ఇటీవల రీ వెరిఫికేషన్‌లో 131 మంది దివ్యాంగులను అనర్హులుగా గుర్తించినట్లు ప్రకటించారు. ఈ 131 మందిలో 108 పింఛన్లు రద్దు చేసి, మళ్లీ అప్పీల్ చేసుకోవాలని చెప్పారు. మిగిలిన 23 మందిలో 16 మందికి దివ్యాంగుల కోటాలో రూ.6 వేలు వస్తుండగా వారిని రూ.4వేలు ఇచ్చే వృద్ధాప్య పింఛన్‌దారులుగా మార్చారు. మరో ఏడుగురిని ఆరోగ్య పింఛన్ల కింద రూ.15 వేలు ఇస్తుండగా వారిని రూ.4 వేల వృద్ధాప్య పింఛన్లలోకి మార్చారు.

ఇష్టారాజ్యంగా పరీక్షలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దివ్యాంగుల వికలాంగత్వం రీ వెరిఫికేషన్ చేపట్టింది. అయితే వైద్యులు ఇష్టం వచ్చినట్లు పరీక్షలు చేసి తక్కువ పర్సంటేజీలు ఇవ్వడంతో ఎంతో మంది అర్హులకు అన్యాయం జరిగింది. కనీసం వికలాంగులమన్న కనికరం కూడా లేకుండా రీ వెరిఫికేషన్ రోజుల తరబడి తిప్పుకున్నారని దివ్యాంగులు వాపోతున్నారు.

☛ హనుమంతునిపాడు మండలంలో 467 దివ్యాంగ పింఛన్లు ఉన్నాయి. వాటిలో 67 మందికి పింఛన్లు తొలగించినట్లు నోటీసులు జారీ చేశారు. 10 ఏళ్ల నుంచి తీసుకుంటున్న దివ్యాంగులు ఉన్నారు. పింఛన్లు తొలగించిన వారిలో చేతులు, కాళ్ల వంకరపోయి కనీసం నడవలేని వారే ఉన్నారు. వారి పింఛన్లను వికలాంగత్వం తక్కువ ఉందన్న సాకుతో తొలగించారు. ఏ పనిచేయలేని మా పట్ల ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించి మా నోటికాడి కూడు తీశారని కన్నీరుమున్నీరవుతున్నారు.

☛ ముండ్లమూరు మండలంలో సుమారు 160 మంది దివ్యాంగుల పింఛన్లు తొలగించారు. దీంతో బాధితులంతా బుధవారం ఎంపీడీఓ కార్యాలయానికి పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. వైద్యులు ఇష్టం వచ్చినట్లు పరీక్ష చేసి పర్సంటేజీలు తగ్గించి రాసి అన్యాయంగా మా పెన్షన్లు తొలగించారని గోడు వెళ్లబోసుకున్నారు. అయినా అధికారులెవ్వరూ పట్టించుకోలేదు. దీంతో కలెక్టర్‌ను కలిసి విన్నవిస్తామని, అక్కడ న్యాయం జరగకపోతే ఆందోళన బాట పడతామని స్పష్టం చేశారు.

15 ఏళ్ల నాటి సర్టిఫికెట్లు చెల్లవట!



పీసీపల్లి ఎంపీడీఓ కార్యాలయం వద్ద మాల్యాద్రి

పీసీపల్లి మండలం చిన్న బట్టుపల్లి గ్రామానికి చెందిన బండి మాల్యాద్రికి 15 ఏళ్ల క్రితం పక్షవాతం సోకింది. అప్పటి వైద్యులు 50 శాతం వికలాంగత్వం ఉందని ధ్రువీకరించగా పెన్షన్ మంజూరు చేశారు. ఆయన పెన్షన్‌ను వెరిఫికేషన్ పేరుతో కూటమి ప్రభుత్వం తొలగించడంతో లబోదిబోమంటున్నాడు. ''వారం రోజులుగా ఎంపీడీఓ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా. 'అధికారులు లేరు, ఉన్నా మా చేతుల్లో ఏమీ లేద'ని చెబుతున్నారు'' అని మాల్యాద్రి కంటతడి పెట్టాడు.

పీసీపల్లి మండలం పాలేటిపల్లి గ్రామానికి చెందిన నారపురెడ్డి రమణమ్మ నడుములకు సర్జరీ అనంతరం మంచానికి పరిమితమైంది. ఐదేళ్ల క్రితం సదరంలో వైద్యులు పరీక్షించి 69 పర్సెంటేజీతో సర్టిఫికెట్ ఇవ్వగా పెన్షన్ డబ్బుతోనే జీవిస్తోంది. వెరిఫికేషన్ నెపంతో ఆమె పెన్షన్ పీకేసిన ప్రభుత్వం.. పునఃపరిశీలనకు ఎంపీడీఓకు అర్జీ పెట్టుకోవాలని నోటీస్ ఇచ్చింది. రానూపోను సుమారు 40 కిలోమీటర్లు ప్రయాణించాలంటే ఆటో బాడిగ రూ.1000 కట్టాలని, అంత స్థోమత తనకు లేదని రమణమ్మ వాపోతోంది.

– పీసీపల్లి

విద్యార్థులు ప్రపంచాన్ని చదవాలి




సభలో మాట్లాడుతున్న ప్రెస్ అకాడమీ చైర్మన్ సురేష్ కుమార్

● ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్

ఒంగోలు టౌన్: విద్యార్థులు పాఠ్యాంశాలతోపాటు పుస్తకాలు చదవాలని, సరైన కోణంలో ప్రపంచాన్ని అర్థం చేసుకునేందుకు ప్రయత్నించాలని ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ సూచించారు. స్థానిక పీవీఆర్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏడో రోజు గురువారం పుస్తక ప్రదర్శనను ఆయన తిలకించారు. అనంతరం మాదాల రంగారావు సాహిత్య వేదికపై ప్రెస్ అకాడమీ చైర్మన్ మాట్లాడుతూ.. నేటి విద్యార్థుల్లో సామాజిక స్పృహ సన్నగిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గాజా యుద్ధంలో 20 వేల మందికి పైగా చిన్నారులు మరణించారని, వారిలో అత్యధికంగా తిండి కోసం బారులుగా నిలబడినవారే ఉండటం బాధాకరమన్నారు. అమెరికా ఇప్పటికీ ఈ మానవ హననం కొనసాగాలని కోరుకుంటోందని చెప్పారు. ఆర్యులు భారతదేశానికి వలస వచ్చినవారేనన్న వాదన కొన్ని శతాబ్దాలుగా చర్చలో ఉందని, వీటన్నింటినీ పుస్తకాలు చదవడం ద్వారా తెలుసుకోవాలని చెప్పారు. మాతృభాషకు ప్రాధాన్యత ఇస్తూనే ఇంగ్లిష్ నేర్చుకోవాలని సూచించారు. తాను కూడా పీవీఆర్ ఉన్నత పాఠశాలలోనే చదువుకున్నానని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాల సుబ్రమణ్యం మాట్లాడుతూ.. విద్యాలయాల్లో కేవలం పాఠ్య పుస్తకాలకే పరిమితం కావాలని, ఇతర వ్యాపకాలు ఉండకూడదని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం దుర్మార్గమన్నారు. విద్యార్థులు అన్ని రకాల పుస్తకాలు చదవడం ద్వారా ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలని, ఎల్లలు లేకుండా ఎదగాలని ఆకాంక్షించారు. తొలుత అద్దంకి బస్టాండ్ నుంచి పీవీఆర్ గ్రౌండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షుడు మనోహర్ నాయుడు అధ్యక్షత వహించిన సభలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాల కృష్ణ, విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యదర్శి లక్ష్మయ్య, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, జేవీవీ నాయకులు సీఏ ప్రసాద్, ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రా నాయక్, కార్యదర్శి చిన్నం పెంచలయ్య, కవి పొన్నూరి వెంకట శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నల్లమలలో గుప్త నిధుల తవ్వకాలు

- జేసీబీ, జీప్‌ను స్వాధీనం చేసుకున్న ఫారెస్ట్ అధికారులు
- పట్టుబడిన ఇద్దరు నిందితులు.. పరారీలో మరికొందరు



వీరులోడు స్వామి కుంటలో తీసిన లోతైన గొయ్యి



ఫారెస్ట్ అధికారులు స్వాధీనం చేసుకున్న జేసీబీ, జీప్

యర్రగొండపాలెం: నల్లమల అటవీ ప్రాంతంలో గుప్త నిధుల తవ్వకాన్ని ఫారెస్ట్ అధికారులు అడ్డుకున్నారు. యర్రగొండపాలెం మండలం గంజివారిపల్లె రేంజ్ పరిధిలో చెన్నుపల్లికి సమీపంలో వెలసిన వీరులోడు స్వామి కుంట వద్ద కొందరు వ్యక్తులు బుధవారం అర్ధరాత్రి తర్వాత గుప్త నిధుల కోసం జేసీబీతో తవ్వకాలు మొదలుపెట్టారు. ఈ విషయం తెలుసుకున్న రేంజ్ ఇన్‌చార్జి అధికారి ప్రసన్న జ్యోతి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ షేక్.కరీముల్లా తమ సిబ్బందితో దాడి చేశారు. అధికారుల రాకను పసిగట్టిన దుండగులు కొందరు అక్కడి నుంచి పరారు కాగా ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులు ఉపయోగించిన జీప్, జేసీబీలను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను విచారిస్తున్నామని, పరారైన వ్యక్తులను త్వరలోనే అరెస్టు చేస్తామని ఫారెస్ట్ సెక్షన్ అధికారి తెలిపారు. నల్లమల అటవీ ప్రాంతంలో పులుల సంచారం ఎక్కువ ఉందని, వాటి బారిన పడి ప్రాణాల పైకి తెచ్చుకోవద్దని హెచ్చరించారు.

ట్రాక్టర్ నుంచి జారిపడి ఒకరు మృతి

మద్దిపాడు: ట్రాక్టర్ నుంచి జారిపడి కూలీ మృతి చెందిన సంఘటన గురువారం మధ్యాహ్నం మద్దిపాడు మండలం బసవన్నపాలెం సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలోని నందిపాడు గ్రామానికి చెందిన కాకి సుబ్బారావు కూలీ పనులు చేసుకుని జీవనం గడుపుతుంటాడు. గురువారం మధ్యాహ్నం స్వగ్రామం నుంచి సీతారాంపురం కొష్టాలు వెళ్తున్న ట్రాక్టర్ ఎక్కాడు. బసవన్నపాలెం సమీపంలో ట్రాక్టర్ నుంచి జారి పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుని కుమారుడు వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు మద్దిపాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పీఈటీపై కేసు నమోదుకు టీడీపీ నేతల అడ్డుపుల్ల!

- ఊళ్లపాలెం జెడ్పీ హైస్కూల్ పీఈటీపై పోక్సో కేసు నమోదుకు కలెక్టర్ ఆదేశించినా స్పందన శూన్యం
- మంత్రి డోలాతో చర్చించాకే కేసు కట్టాలని టీడీపీ నేతలు ఒత్తిడి చేస్తున్నట్లు ఆరోపణలు

ఒంగోలు టాస్క్‌ఫోర్స్: సింగరాయకొండ మండలం ఊళ్లపాలెం జెడ్పీ హైస్కూల్లో ఓ బాలికను లైంగికంగా వేధించిన వ్యాయామ ఉపాధ్యాయుడు పిల్లి హజరత్తయ్య సస్పెండ్ అయిన సంగతి తెలిసిందే. అతనిపై పోక్సో కేసు నమోదు చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించినా పోలీసులు మీనమేషాలు లెక్కిస్తుండటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈనెల 19వ తేదీ సాయంత్రం పీఈటీపై ఫిర్యాదు చేయడానికి డీవైఈఓ చంద్రమౌళీశ్వరరావు సింగరాయకొండ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. ఏమైందో ఏమో కానీ ఫిర్యాదు చేయకుండానే వెనుదిరిగారు. దీనిపై విద్యాశాఖ, పోలీసులను వివరణ కోరగా భిన్నమైన సమాధానాలివ్వడం అనుమానాలకు తావిస్తోంది.

డీవైఈఓ మాట్లాడుతూ.. తాను 19వ తేదీ రాతపూర్వకంగా అర్జీ తీసుకెళ్తే పోలీసులు టైప్ చేయించి ఇవ్వాలని సూచించారన్నారు. కంప్యూటర్‌లో టైప్ చేయించుకుని వెళ్తే సీఐ హజరత్తయ్యకు ఇవ్వాలనడంతో రాత్రి 8.30 గంటల వరకు వేచిచూసి వెనుదిరిగానని చెప్పారు. ఎస్సై బి.మహేంద్ర మాట్లాడుతూ.. ఊళ్లపాలెం పీఈటీపై ఫిర్యాదు చేయడానికి డీవైఈఓ రాగా కొన్ని వివరాలు అడిగామని, సమాచారం లేకపోవడంతో కలెక్టర్‌తో మాట్లాడి మళ్లీ వస్తానని వెళ్లిపోయారని చెప్పారు. ఇదిలా ఉండగా.. మంత్రి స్వామితో మాట్లాడిన తర్వాతే కేసు నమోదు చేయాలని అప్పటి వరకు ఎలాంటి చర్యలు వద్దని అధికార పార్టీ నాయకులు కొందరు ఎస్సైపై ఒత్తిడి తెచ్చారని బీసీ సంఘ నాయకుడు పాటిబండ్ల లపూడి జయరాం ఆరోపించారు.

గంజాయి రవాణా కేసులో మరో ముగ్గురి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రవికుమార్

మద్రిపాలెం(విశాఖ జిల్లా): ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో ఊహించని మలుపు చోటు చేసుకుంది. ప్రమాదానికి కారణమైన కారులో గంజాయిని గుర్తించిన పోలీసులు, ఆ కేసులో పరారీలో ఉన్న మరో ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ విషయాన్ని గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ రవికుమార్ వెల్లడించారు. ఈ నెల 12న సుభాష్‌నగర్ వద్ద జరిగిన ప్రమాదంలో ఒక కారు ఢీకొని ఏడాదిన్నర చిన్నారి వర్షిత్ మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ ఘటన తర్వాత కారు డ్రైవర్, తమిళనాడుకు చెందిన అర్జునన్ జెమినీ అధ్మఘంను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే ప్రమాదం జరిగినప్పుడు కారులో ఉన్న మరో ముగ్గురు పరారయ్యారు. పోలీసులు ఈ నెల 16న సీజ్ చేసిన కారును తనిఖీ చేయగా.. అందులో 21 కిలోల గంజాయిని గుర్తించారు. విచారణలో భాగంగా పరారీలో ఉన్న ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారిలో హైదరాబాద్‌లోని హాస్టల్‌లో ఉంటున్న గుంటూరుకు చెందిన 20 ఏళ్ల అక్షయ గౌతమి, ఒంగోలుకు చెందిన 25 ఏళ్ల పెర్లి విజయవర్ధన్ రాజు, గుంటూరుకు చెందిన 19 ఏళ్ల షేక్ మహమ్మద్ జాకీర్ ఉన్నారని సీఐ తెలిపారు. ఈ నలుగురు విజయవాడలో కారు అద్దెకు తీసుకుని అరకు వెళ్లి అక్కడ గంజాయి కొనుగోలు చేశారు. తిరిగి వస్తుండగా ఊర్వశి జంక్షన్ సమీపంలోని సుభాష్‌నగర్ వద్ద ప్రమాదం జరిగింది. నిందితుల్లో ఒకరైన పెర్లి విజయవర్ధన్ రాజుపై ఇప్పటికే ఒంగోలులో 11 కేసులు ఉన్నాయని, మరొక నిందితుడు మహమ్మద్ జాకీర్‌పై కూడా గంజాయి కేసు ఉందని పోలీసులు వెల్లడించారు. యువతికి తల్లిదండ్రులు లేరు. విజయవర్ధన్‌కు బంధువు కావడంతో అతనితో ఇలా వెళ్తూ ఉంటుంది. ఈ కేసులో ప్రతిభ చూపించిన ఎస్ఐలు షేక్ సమీర్, రవికుమార్‌లను సీఐ అభినందించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పాటే ఆయుధం



ఒంగోలు కళా ఉత్సవాల్లో నృత్య రూపకాల ప్రదర్శన

ఒంగోలు టౌన్: ప్రజా సమస్యల పరిష్కారానికి పాటే ఆయుధంగా ప్రజా నాట్యమండలి కళారూపాలు నిర్వహిస్తుందని ప్రజా నాట్యమండలి గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సీపీఐ రాష్ట్ర మహాసభలను పురస్కరించుకొని నగరంలోని సీవీఎన్ రీడింగ్ రూంలో నిర్వహిస్తున్న ఒంగోలు కళా ఉత్సవాలు గురువారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో నల్లూరి మాట్లాడుతూ...ప్రజలను చైతన్య పరిచి ఉద్యమ మార్గంలోకి నడిపించే శక్తి ఒక్క పాటకు మాత్రమే ఉందని చెప్పారు. పేదలకు భూములు పంచడం, కూలి రేట్లు పెంచడం, కార్మికుల హక్కుల కోసం చేస్తున్న పోరాటాల్లో పాట కీలక పాత్ర పోషిస్తోందన్నారు. సినీ గేయ రచయిత ఎస్‌కే మీరా మాట్లాడుతూ.. పామరులకు సైతం వేదిక ఇచ్చిన గొప్ప చరిత్ర కమ్యూనిస్టు పార్టీలకే దక్కుతుందన్నారు. మూడో తరగతి మాత్రమే చదివిన తాను రాసిన భక్తి కోరిన బలి, కనురెప్ప, చర్లపల్లి భూ పోరాటాలు, పద్మవ్యూహం నాటికలు ప్రజాదరణ పొందాయని చెప్పారు. సభలో ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రనాయక్, కార్య నిర్వాహక కార్యదర్శి రామకృష్ణ, కోశాధికారి పిచ్చయ్య, ధూళిపాళ్ల సీతారామయ్య, ఎస్కే నజీర్ పాల్గొన్నారు.